## క్లుప్తంగా

### ఆక్రమణల తొలగింపుపై అధికారుల సమీక్ష


నారాయణపురంలో ఆక్రమణల తొలగింపుపై సమీక్షిస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

**ఉంగుటూరు:** నారాయణపురంలో వంతెన వద్ద నుంచి గణపవరం రహదారిలో విస్తరించిన ఆక్రమణలు తొలగించాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ ఆదేశించారు. తొలిదశలో ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న గృహాల వారు, దుకాణదారులే స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకునే అవకాశం ఇవ్వాలని లేని పక్షంలో అన్ని శాఖలు అధికారుల సాయంతో తొలగించాలని నిర్ణయించారు. ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దారు చంద్రప్రసాద్, ఎస్సై సూర్యభగవాన్ ,ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఆర్అండ్‌బీ అధికార్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఘనంగా గౌరీదేవి ఉత్సవాలు


గౌరీదేవి గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు

**దెందులూరు:** పోతునూరు గ్రామం కొత్తూరుతో పాటు శివారు గ్రామాల ప్రజలందరూ కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా గ్రామ దేవత గౌరీదేవిని పూజిస్తారు. పంటలు ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా రైతులందరూ పాడి పంటలతో ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని కోరుతూ పోతునూరు గ్రామ దేవత గౌరీదేవిని స్థానికులు రెండు రోజులుగా పూజిస్తున్నారు. శనివారం వైభవంగా నిర్వహిస్తున్న గౌరీ దేవి ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గౌరీదేవి ప్రతిమను శిరస్సుపై పెట్టుకుని భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు.

### లయన్స్ క్లబ్ లక్ష్యాలకు అనుగుణంగా సేవలు


ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**దెందులూరు:** లయన్స్ క్లబ్ మెంబర్‌గా చేరటం సంతోషంగా ఉందంటూ మండల విద్యాశాఖ అధికారి ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శనివారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా చిత్తశుద్ధితో సేవాభావంతో పనిచేస్తున్న లయన్స్ క్లబ్ లక్ష్యాలకు అనుగుణంగా సేవలందిస్తానన్నారు. లయన్స్ క్లబ్ సీనియర్ రాష్ట్ర నాయకులు, రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు బీవీ రమణమూర్తి, జిరజాపు రంగారావు, చుక్కా అవినాష్ రాజు కృషితో లయన్స్ క్లబ్‌లో చేరినట్లు తెలిపారు. సీనియర్ లయన్స్ క్లబ్ నాయకులు తోట ఎడ్వర్డ్ ఎంఈఓకు లయన్స్ క్లబ్ సభ్యత్వాన్ని అందించారు.

### దత్త క్షేత్రంలో దీపోత్సవం


బాదంపూడి దత్త క్షేత్రంలో దీపాలతో అలంకరణ

**ఉంగుటూరు:** బాదంపూడి దత్త బాల సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం కృత్తికా దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి దీప సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దత్త భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

### రైతుల సమస్యలపై 26న మహాధర్నా

**ఏలూరు (టూటౌన్):** రైతాంగ సమస్యల పరిష్కారం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీ అమలు కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం రైతుల సమావేశం శనివారం నిర్వహించారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 26న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని కోరారు. 26న జరిగే కలెక్టరేట్ మహాధర్నా విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేస్తామని తెలిపారు. సమావేశంలో పి.దావీదు, కె.జగదీష్, బొద్దు చింతయ్య, పి.డేవిడ్ పాల్గొన్నారు.

# ఇన్‌చార్జిల పాలనలో అరకొర సేవలు

- ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న అధికారుల కుర్చీలు
- అదనపు బాధ్యతలతో ఉద్యోగులు సతమతం


ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయం

**ఉంగుటూరు:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పలు శాఖల అధికారుల కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ తహసీల్దారుతోపాటు అన్ని ప్రధాన పోస్టుల్లోనూ ఇన్‌చార్జులే కొనసాగుతున్నారు. దీంతో ప్రజలకు అరకొర సేవలు అందుతున్నాయి. కార్యాలయంలో అధికారులు రోజూ అందుబాటులో లేకపోవడంతో అక్కడికి వివిధ పనులపై వచ్చే అర్జీదారులు, ప్రజలు నిరాశతో వెనుతిరిగి వెళ్లడం నిత్యకృత్యమైంది.

**ఎన్నికల సమయంలో వచ్చిన వారంతా బదిలీ**

ప్రధానంగా ఎన్నికల సమయంలో ఇక్కడికి వచ్చిన తహసీల్దార్ తిరిగి కృష్ణా జిల్లా వెళ్లిపోయారు. అప్పటి నుంచి తహసీల్దారు కుర్చీ ఖాళీగా ఉంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సత్యనారాయణ నరసాపురం ఎమ్మెల్యే పీఏగా వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. సివిల్ సప్లై డీటీగా పనిచేస్తున్న దుర్గ భీమడోలు సివిల్ సప్లై గోడౌన్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. దాంతో ఆ కుర్చీ ఖాళీగా దర్శనమిస్తోంది. మండల సర్వేయర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆ కుర్చీ ఖాళీగా ఉంది. ఇలా అన్ని ఉద్యోగుల కుర్చీలూ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా ఎన్నికల సమయంలో ఇక్కడికి వచ్చిన తహసీల్దారు శివయ్య తిరిగి కృష్ణా జిల్లా వెళ్లిపోవడంతో ఆస్థానంలో పి.సతీష్‌ను నియమించారు. తహసీల్దారుగా 21 రోజులు పనిచేశాక ఆయనను అమరావతికి బదిలీ చేశారు. అనంతరం డీటీగా పనిచేస్తున్న బొద్దేపల్లి దుర్గప్రసాదుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. నెలరోజులపాటు ఆయన తహసీల్దార్‌గా పనిచేశాక బొద్దేపల్లిని నిడమర్రు డీటీగా బదిలీ చేశారు.


ఖాళీగా దర్శనమిస్తున్న ఉంగుటూరు తహసీల్దారు కుర్చీ

**డీటీకి అదనపు బాధ్యతలు**

బొద్దేపల్లి స్థానంలో ఉంగుటూరు డీటీగా పూర్ణచంద్రప్రసాదును నియమించారు. ఆయన ప్రస్తుతం డీటీగా పనిచేస్తూ అదనంగా తహసీల్దారు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అదనపు బాధ్యతలు అప్పగించడంతో పనిభారం పెరిగి ఉద్యోగులు సతమతమవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి స్థాయిల్లో అధికారులను నియమించి ఖాళీలన్నీ భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా శ్రద్ధ వహించాలి


వేగివాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న అధికారులు

**పెదవేగి :** చక్కటి ఆటపాటలతో చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా తల్లిదండ్రులతోపాటు అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. పెదవేగి మండలం వేగివాడ కోడ్ నంబర్ 213 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అదనపు సీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. పోషకాహార పంపిణీ తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. తల్లీబిడ్డ సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న పోషకాహారాన్ని, అంగన్‌వాడీ కార్యకర్త బోధనా విధానాన్ని పరిశీలించారు. కేంద్రంలో ఉన్న 18 మంది పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సుజాత తదితరులు ఉన్నారు.

## గౌతమబుద్ధుని బోధనలు ఆచరణీయం


గుండుగొలనులో గౌతమబుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఏఈ ఆర్.భీమేశ్వరరావు తదితరులు

**భీమడోలు:** గౌతమబుద్ధుని బోధనలు ఆచరణీయమని పలువురు వక్తలు అన్నారు. గుండుగొలనులో శనివారం విగ్రహ దాత వగ్వాల శ్రీరామచంద్రమూర్తి సహకారంతో ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని విద్యుత్ ఏఈ రాళ్లపల్లి భీమేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. యువత గౌతమ బుద్ధుని బోధనలను అనుసరించి తమ జీవన విధానానికి మంచి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని వారన్నారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మామిళ్లపల్లి కాశీబాబు, నెహ్రూ, అంగరాకుల సూర్యనారాయణ, సత్యనారాయణ, బాబులు, పుండరీకంపాల్గొన్నారు.

# పేదలకు ఉచిత న్యాయ సహాయం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సి.పురుషోత్తమ్‌కుమార్

**దెందులూరు:** పేదలకు ఉచిత న్యాయ సహాయం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి సి.పురుషోత్తమ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ్‌కుమార్ అధ్యక్షతన శనివారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ ఫర్ ఉమెన్ బ్లాక్ లెవెల్ -2లో భాగంగా మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, జాతీయ మహిళా కమిషన్ న్యాయ సేవాధికార సంస్థలు సంయుక్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు వారి రక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సదస్సులో గృహహింస, వరకట్న వేధింపులు, బాలికలపై లైంగిక వేధింపుల నిరోధ చట్టం, బాధితులకు పరిహారం అంశాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 నంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణ సంబంధిత అధికారులు స్పందించి న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. జిల్లా అధికార సంస్థ ఏలూరుతో అన్ని కోర్టుల పరిధిలో మండల న్యాయ సేవాధికార సంస్థలు పని చేస్తున్నాయన్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం, ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసి కేసులను వాదిస్తారన్నారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి మహిళకి చట్టాలపై అవగాహన కల్పించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్, సంఖ్యలో మహిళలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ ఉద్యమ నేతల సేవలు చిరస్మరణీయం


భీమడోలు లైబ్రరీలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, హాజరైన టీవీ ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్

**భీమడోలు:** గ్రంథాలయ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నేతల సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమంలో అవిరళ కృషి చేసిన గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్, నిర్వహణ ఆద్యుడు పాతూరి నాగభూషణంకు సంస్కరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరియర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాజ రవివర్మ జయంతిని పురస్కరించుకుని చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పూళ్లలో గ్రంథపాలకుడు డీఎస్‌టీ అమర్‌నాథ్, గుండుగొలను గ్రంథపాలకుడు జి.నాగమణి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యాపకులు పి.బాలు, టీచర్లు వెంకట సీత, దేవమాత, ఆనందబాబు పాల్గొన్నారు.

**విద్యార్థులకు వ్యాసరచన పోటీ**

**పెదపాడు:** స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ గురుకులంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామాల బెంజిమన్, యస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాలు కీలకపాత్ర**

**ఉంగుటూరు:** స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయాలు కీలకపాత్ర వహించాయని తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు అన్నారు. ఉంగుటూరు శాఖ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న ఆయన గ్రంథాలయ ఉద్యమకారులు మహనీయుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఎంవీఐ నారాయణ, భారతీ పాల్గొన్నారు. గ్రంథపాలకుడు గంగాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహించారు.


దెందులూరులో గ్రంథాలయ వారోత్సవాలు

**గ్రంథాలయోద్యమంతో ప్రజా చైతన్యం**

**గణపవరం:** గ్రంథాలయోద్యమం ప్రజల్లో నూతనోత్తేజాన్ని నింపి, స్వాతంత్ర్య సముపార్జనకు దోహదపడిందని పలువురు అన్నారు. శనివారం గణపవరం మండలం పిప్పర శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. హైస్కూలు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, న్యాయవాది గుడ్ల కృష్ణారావు, గ్రంథ పాలకుడు పి.రంగారావు పాల్గొన్నారు. గణపవరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పోతునూరు గ్రంథాలయంలో..**

**దెందులూరు:** విద్యార్థులు, యువత చదువుతో పాటు గ్రంథాలయాలను సక్రమంగా వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పోతునూరు గ్రంథాలయ గ్రంథపాలకులు జి రాంబాబు అన్నారు. జాతీయ 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు, యువతకు, గ్రామస్తులకు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల ప్రాముఖ్యతను వివరించి వారోత్సవాలు నిర్వహించారు. పోతునూరులో లైబ్రేరియన్ రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థి విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పోతునూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ వల్లి, సిబ్బంది రాహుల్, పోతునూరు, దెందులూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ అమలులో అలసత్వం


పోలసానిపల్లి హైవేపై దర్శనమిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ


భీమడోలు రైల్వే గేటు నుంచి సంతమార్కెట్‌కు వెళ్లే దారిలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీ

**భీమడోలు:** ఎమ్మెల్సీ కోడ్ అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గ్రామాల్లో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్లు దర్శనమివ్వడంతో కోడ్ అమలు కావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని భీమడోలు, పోలసానిపల్లి, పూళ్ల, గుండుగొలను తదితర గ్రామాల్లో ఫ్లెక్సీలను తొలగించిన దాఖలాలు కానరావడం లేదు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చి 10 రోజులు గడుస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో కోడ్ అమలు కావడం లేదు. అధికార పార్టీ ఫ్లెక్సీలను తొలగించకుండా ఉద్యోగులు చోద్యం చేస్తున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు వాపోతున్నారు. పోలసానిపల్లి హైవేపై గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఫ్లెక్సీ దర్శనమిస్తోంది. భీమడోలు రైల్వే గేటు నుంచి సంతమార్కెట్ వరకు ఫ్లెక్సీలు, కటౌట్లు దర్శనమిస్తున్నారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, పీఎం ఫ్లెక్సీలు ఎక్కడబడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. నిత్యం ఈ కూడలి ప్రాంతాల్లో అధికారులు తిరుగుతున్నా వాటి జోలికి వెళ్లకపోవడం దారుణమని పలువురు అంటున్నారు. ఈ విషయంపై సంబంధిత ఎంపీడీవోకు ఫోన్‌లో ఫిర్యాదు చేసామని, పట్టించుకోలేదని జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. దీనిపై ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవిని వివరణ కోరగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పగడ్బందీ అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో ఇప్పటికే ఫ్లెక్సీలు, కటౌట్లు తొలగించామన్నారు. రాజకీయాల నాయకులు కోడ్ అమలుకు గ్రామ స్థాయి అధికారులకు సహాయ సహకారాలను అందించాలని కోరారు.

## దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

**దెందులూరు:** దళితుల ఐక్యత, అభివృద్ధి, సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని దెందులూరు మండలం కొత్తగూడెం పంచాయతీ కొమిరేపల్లికి చెందిన మాల మహాసేన జిల్లా కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన గంటా విజయ్‌కుమార్ (పండు) అన్నారు. ఏలూరు జిల్లా ఏలూరు మాల సేన ఏపీ రాష్ట్ర కార్యాలయంలో ఏలూరు జిల్లా మాల సేన అధ్యక్షుడు పల్లి విజయ్ చేతుల మీదుగా ఏలూరు జిల్లా మాల సేన కార్యదర్శిగా గంటా పండు నూతనంగా నియమించారు. మాల సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఇరికిపాటి విజయ్, సీనియర్ దళిత ఉద్యమ నాయకుడు కనికెళ్ళ మురళి, మాల సేన ఏపీ రాష్ట్ర కార్యదర్శి నూతులపాటి నవీన్ రాజు పాల్గొన్నారు.

## నవసమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర గొప్పది

**భీమడోలు:** నవ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర గొప్పదని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలులోని మాంటిస్సోరి విద్యాసంస్థల కార్యాలయంలో శనివారం జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి పెనుమూడి బాలు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై వై.సుధాకర్ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సులో పాత్రికేయుల పాత్ర ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులను సత్కరించారు. అనంతరం ఎస్సై వై.సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అశోక్, కేసరి, సిబ్బంది పాల్గొన్నారు.

## మాదిగలకు న్యాయం చేయాలి

**దెందులూరు:** ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికతో సిఫారసు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, కందుల రమేష్, తనగాల శేఖర్, కె.మురళి డిమాండ్ చేశారు. శనివారం దెందులూరులో వారు మాట్లాడుతూ 60 రోజుల్లో ఈ కమిషన్ రాజ్యాంగ సూత్రాలు అనుగుణంగా నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. మాదిగ సామాజిక వర్గానికి న్యాయం అందించాలని కోరుతున్నామన్నారు.

## బొబ్బిలి వంతెన నిర్మించాలి

**గణపవరం:** శిథిలావస్థకు చేరిన గణపవరం బొబ్బిలి వంతెన నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకోవాలని మండల సీపీఎం సమావేశంలో నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గనపవరం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మండల పార్టీ కన్వీనర్ ఎం.పెంటారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ వందేళ్ల క్రితం బ్రిటిష్ హయాంలో నిర్మించిన ఈ వంతెన శ్లాబు నాలుగు దశాబ్దాల క్రితం కూలిపోయిందన్నారు. అప్పట్లో కొత్త శ్లాబు వేశారని, ప్రస్తుతం ఈ వంతెన శిథిలమై ప్రమాదకరంగా ఉందన్నారు. ఈ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, నూతన వంతెనను నిర్మాణాన్ని ప్రారంభించాలని ఆయన కోరారు. సీపీఎం కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గణపవరం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు పెచ్చెట్టి నర్సింహామూర్తి, చిన్నం నాగేశ్వరరావు, సోడదాసి సంజీవరావు పాల్గొన్నారు.



## ఆలయాల పరిరక్షణే ధ్యేయంగా హైందవ శంఖారావం


వంగూరు శివాలయంలో విశ్వహిందూ పరిషత్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న నాయకులు

**పెదవేగి :** ఆలయాల పరిరక్షణే ధ్యేయంగా హిందువులంతా ఏకమై హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని జిల్లా కో కన్వీనర్ మేడిశెట్టి పాములు పిలుపునిచ్చారు. శనివారం పెదవేగి మండలం వంగూరులోని శివాలయం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం దెందులూరు ఖండ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాములు మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం భారీ సభ ద్వారా హిందూ ఆలయాల వ్యవస్థను రక్షించుకునేందుకు ప్రతి ఒక్క హిందువు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో సంఘ పరివార్, వివిధ క్షేత్ర కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మ ప్రచార ప్రముఖ్ కొండేటి ఆంజనేయులు,హైందవ శంఖారావం జిల్లా ప్రముఖ్ వంశీ జీ, ఏలూరు గ్రామీణ ఖండ కార్యవాహ మేడిచర్ల కృష్ణ, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గేద్దం నాగరాజు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# యంత్రాలతో వరి మాసూళ్లు ... పశుగ్రాసానికి కొరత


బోగాపురంలో యంత్రంతో వరి కోత

**పెదవేగి :** వరి మాసూళ్లలో యంత్రాల వినియోగం బాగా పెరిగింది. మాసూళ్లను కూలీలతో చేయిస్తే అధిక వ్యయమవుతుందని భావిస్తున్న రైతులు యంత్రాల వైపే మొగ్గు చూపుతున్నారు. యంత్రాలతో వరి కోతలు పశుగ్రాసానికి ముప్పుగా మారింది. యంత్రాలతో వరి పంట కోస్తే ఆ గడ్డి పశుగ్రాసంగా పనికిరావడం లేదు. దీంతో వేసవిలో పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతోంది.

**50 శాతం పైగా యంత్రాలతోనే మాసూళ్లు**

ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో మాసూళ్లకు 50శాతంమందికి పైగా రైతులు వరి కోతకు యంత్రాలను ఆశ్రయించారు. పంటలను త్వరగా ఇంటికి చేర్చుకునేందుకుకూడా వీలుండటంతో యంత్రాల వైపే మొగ్గుతున్నామని రైతులు చెబుతున్నారు. వరి దుబ్బలను సగానికి పైగా వదిలివేసి యంత్రాలు కోస్తాయి. దీంతో యంత్రాలతో మాసూళ్ల చేస్తే వచ్చే ఎండుగడ్డి పరిమాణం బాగా తగ్గుతోంది. దీనికితోడు యంత్రంతో ధాన్యం నూర్చడం వల్ల గడ్డి పూర్తిగా నలిగి బయటకు వస్తుంది. ఈ గడ్డిని పశువులు తినడం లేదు. పశుగ్రాసం కొరతను రైతులు అధిగమించేందుకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నామని వ్యవసాయాధికారులు చెబుతు న్నారు. ఎండుగడ్డి అయితే నిల్వ చేసుకుని వాడవచ్చని, పచ్చిరొట్ట తాత్కాలికంగా ఉపయోగపడుతుందని పశుపోషకులు వాపోతున్నారు.

**యంత్రాలతో కోసినా..**

మండలంలో గేదెలు ఆవులు మొత్తం కలిపి 44,523 పశువులున్నాయి. యంత్రంతో కోసిన వరిగడ్డి మిషన్ చక్రాల కిందపడి నలిగిపోయి, బురద అంటుకుని ఉంటుంది. దీంతో పశువులు ఆ గడ్డిని తినేందుకు అంతగా ఆసక్తిచూపవు. రైతులు ఆ గడ్డిని చిన్న ముక్కలుగా చేసి శుభ్రపరచి పశువులకు వేస్తే తినే అవకాశం ఉందని వ్యవసాయశాఖాధికారులు అంటున్నారు.